క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో ఎంపీ డీకే అరుణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన అరుణకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ డీఈవో రత్నరాజు ఎంపీ డీకే అరుణకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

లోక బింబం 'శర్మ శతకం'



వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): కాలానికి అనుగుణంగా రచనా రీతులు మారుతుంటాయనడానికి 'శర్మ శతకము' సాక్షిగా నిలుస్తుందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు చెప్పారు. విజయవాడ పుస్తక మహోత్సవంలోని రైటర్స్ స్టాల్‌లో శుక్రవారం కవి, రచయిత శర్మ సీహెచ్ రచించిన 'శర్మ శతకము' పద్య సంపుటిని గుమ్మా సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 108 వచన పద్యాల్లోని మూడో పాదం వేమన శతకంలోని మూడో పాదాన్ని తలపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రచయిత శర్మతోపాటు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, 64 కళలు డాట్ కామ్ ఎడిటర్ కళాసాగర్ పాల్గొన్నారు.

5న ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణస్వీకారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డూండీ రాకేష్ ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల ఐదో తేదీన గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు శ్రీ వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు చెప్పారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు ఆర్యవైశ్య నాయకులతో కలిసి మాట్లాడారు. ఐదో తేదీ జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు, నాయకులు జాలాది నరసింహారావు, సీఎల్ అరుణ్ కుమార్, కేఎల్‌వీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో డాక్టర్ అన్వర్‌కు స్థానం



భవానీపురం(విజయవాడపశ్చిమ):హైకోర్ట్ న్యాయవాది, రీసెర్చ్ స్కాలర్ విద్యాధరపురానికి చెందిన డాక్టర్ అన్వర్ షేక్‌కు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (లండన్)లో స్థానం లభించింది. విద్య, రీసెర్చ్, సామాజిక సేవ అంశాల్లో కృషి చేసినందుకుగాను సంస్థ ఆయనకు ఈ సర్టిఫికెట్ ప్రదానం చేసింది. ఈ మేరకు డాక్టర్ అన్వర్ షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ రీసెర్చ్ స్కాలర్‌గా 2019లో అవార్డ్, అలాగే 2020లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీ పట్టా పొందానని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పలు ఆర్టికల్స్ ప్రచురితమయ్యాయని తెలిపారు. కోవిడ్, ప్రకృతి విపత్తుల సమయాల్లో బాధిత కుటుంబాలకు మందులు, ఆహారం, వైద్య సాయం వంటి అనేక సేవలు అందించానని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వర్ షేక్‌ను పలువురు న్యాయవాదులు, సామాజికవేత్తలు అభినందించారు.

హ్యాకదాన్ పోస్టర్ విడుదల

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శుక్రవారం ఏఐ డివైజెస్ హ్యాకదాన్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకతను పెంపొందించటానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన కాలేజీలో ఏఐ డివైజెస్ హ్యాకదాన్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ హ్యాకదాన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఏఐ డివైజెస్ హ్యాకదాన్ పోటీలో దేశ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.5 లక్షల నగదు బహుమతి అందజేస్తామన్నారు.

రైల్వేస్టేషన్‌లో

అనధికార వెండర్స్ దందా



రైల్వే స్టేషన్‌లో గుర్తింపు కార్డులు లేకుండా విక్రయాలు చేస్తున్న వెండర్స్



ఇటీవల రైల్వే అధికారులు అదుపులోకి తీసుకున్న అనధికారిక వెండర్స్ (ఫైల్)

- నాసిరకం ఆహారం విక్రయాలు
- నిషేధిత బయట ఉత్పత్తుల అమ్మకం
- పెనాల్టీ విధించినా లెక్కచేయని వెండర్స్
- అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):విజయవాడ రైల్వే స్టేషన్‌లో అనధికారిక హాకర్ల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. వీరిని అడ్డుకోవాల్సిన రైల్వే అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేసి కొందరు హాకర్ల నుంచి పెనాల్టీలు విధించి చేతులు దులుపుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొస్తుంది. ప్రయాణికులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం మాత్రమే అందించే లక్ష్యంతో రైల్వేశాఖ క్యాంటీన్‌లు, స్టాల్స్ నిర్వాహకులకు మార్గనిర్దేశకాలు జారీ చేసింది. అందులో ఒక్కో స్టాల్స్‌కు పరిమిత సంఖ్యలో హాకర్లు ఏర్పాటు చేసుకోవడం, వారి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు మెడికల్ సర్టిఫికెట్స్, ఎటువంటి నేర చరిత్ర లేని విధంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌లు సమర్పించాల్సి ఉంటుంది. అటువంటి వారికే రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు పరిమిత సంఖ్యలో స్టేషన్‌లో విక్రయాలు చేసేందుకు గుర్తింపు కార్డులు ఇస్తారు.

నకిలీ గుర్తింపు కార్డులతో....

నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే విజయవాడ రైల్వే స్టేషన్‌లో పది ప్లాట్ ఫాంలు ఉన్నాయి. వాటిలోని క్యాంటీన్‌లు, స్టాల్స్ నిర్వాహకులు కమర్షియల్ విభాగం గుర్తింపు కార్డులు జారీ చేసిన వెండర్స్‌తోనే విక్రయాలు సాగించుకోవాల్సి ఉంటుంది. అయితే రైలు నిలిచే తక్కువ సమయంలోనే ఎక్కువ విక్రయాలు చేసుకునేందుకు నిర్వాహకులు నకిలీ ఐడీ కార్డులతో అనాధికారిక వెండర్స్‌ను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా విక్రయాలు సాగిస్తూ అధిక ఆదాయం సమకూర్చుకునే పనిలో పడ్డారు.

నాసిరకం ఆహారం....

రైలు ప్రయాణికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న రైల్వేశాఖ వారికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం విక్రయించేలా మార్గదర్శకాలు అమలులో చేస్తున్నాయి. వీటి కింద నిర్ధేశించిన కొన్ని రకాల ఆహార ఉత్పత్తులను మాత్రమే ప్రయాణికులకు విక్రయించాల్సి ఉంటుంది. దీనిపై తరచూ అధికారులు తనిఖీలు కూడా చేస్తుంటారు. అయితే కొంత మంది వెండర్స్ చేతులకు గ్లౌజ్‌లు లేకుండా నిషేధించిన సమోసాలు, చాట్ మసాలాలు, ఆమ్లెట్లు, టీ, కాఫీ తదితర నాసిరకం ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయిస్తు ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారు.

పెనాల్టీ వారికొక లెక్కేలేదు....

అనధికార వెండర్స్‌పై రైల్వే కమర్షియల్ అధికారులు స్టేషన్‌లో తనిఖీలు చేపట్టి వారిని అదుపులోకి తీసుకుని ఒక్కొక్కరి నుంచి రూ. 5వేలు పెనాల్టీ విధిస్తున్నారు. ఆ పెనాల్టీ వారికొక లెక్కేలేని విధంగా చెల్లించి మళ్లీ యథేచ్ఛగా తమ దందా కొనసాగిస్తున్నారు. దీనిపై ప్రతి రోజు వారి ఆదాయం ఏ స్థాయిలో ఉంటుందంటే ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతి రోజు తనిఖీలు చేపట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఈ ఫైలింగ్ ఎందుకు చేయడం లేదు?

- ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్
- అదనపు విధులకు హాజరు కావాల్సిందే
- అంతరాలయ దర్శనానికి టికెటు తప్పని సరి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దేవస్థానానికి సంబంధించిన పరిపాలనా అంశాలు, బిల్లులను తప్పని సరిగా ఈ ఫైల్‌లో అప్‌లోడ్ చేయాల్సిందేనని, మ్యానువల్‌గా ఎటువంటి బిల్లులు తన వద్దకు తీసుకురావద్దని దుర్గగుడి ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్ శుక్రవారం ఆలయంలోని పలు కీలక అంశాలపై దృష్టి సారించారు. శుక్రవారం ఆలయ ఏఈవోలు, సూపరిండెంటెంట్లతో సమావేశమయ్యారు. పాలనా పరమైన అంశాల గురించి చర్చించి ఆలయంలో జరిగే వ్యవహారాలన్నీ ఈ ఫైల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ ఉన్న సమయంలో పరిపాలనా విభాగంలోని సిబ్బందికి క్యూలైన్ల వద్ద అదనపు విధులు కేటాయిస్తారు. అయితే ఏ ఒక్క సిబ్బంది కూడా అదనపు విధులకు హాజరు కావడం లేదని తెలుసుకున్న ఇన్‌చార్జి ఈవో తప్పని సరిగా విధులు నిర్వహించాల్సిందేనని స్పష్టం చేశారు. రద్దీ సమయంలో తాను తప్పని సరిగా క్యూలైన్లను పర్యవేక్షించడానికి వస్తానని, సంబంధిత ప్రాంతంలో విధులు కేటాయించిన వారు అక్కడ లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో శుక్రవారం ఉదయం 8 గంటలకే దేవస్థాన పరిపాలనా విభాగం, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది స్కానింగ్ పాయింట్, గాలిగోపురం, లక్ష్మీ గణపతి విగ్రహాల వద్ద విధులు నిర్వహిస్తూ కనిపించారు. మరో వైపున అంతరాలయ దర్శనం వచ్చే భక్తులందరికీ తప్పనిసరిగా రూ. 500 టికెటు ఉండాలని ఆదేశించారు. స్కానింగ్ పాయింట్ వద్ద తనిఖీ చేసిన టికెట్లు, ఆలయంలోకి ప్రవేశించే గేటు వద్ద చింపిన టికెట్ల సంఖ్యలో సమంగా ఉండాలన్నారు. ఒక వేళ ఆలయానికి చెందిన సిబ్బంది ఎవరైనా టికెట్లు లేకుండా అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లితే వారి జీతం నుంచి రికవరీ చేస్తామని తెలిపారు.

వెలంపల్లికి శుభాకాంక్షలు తెలిపిన ఎస్సీ సెల్ నేతలు



వెలంపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీ సెల్ నేతలు

వనటౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావుకు ఆ పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ ఆధ్వర్యంలో ఎస్సీసెల్ నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసిన నేతలు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగళ్ల సంగీత్‌బాబు, యరత్రోన్న విజయలక్ష్మి,, తాండ్రి ఇంద్రకుమార్, మేదర కృష్ణ, పచ్చిగల రమేష్, నన్నం దుర్గ, సుజాత, మేరి జంగం ఆనంద్, వివేక్, రుద్ర శంకర్, ప్రభుదాస్ తదితరులు ఉన్నారు.

సర్వీస్ ప్రొవైడర్లకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న యూసీడీ పీవో వెంకట నారాయణ

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్లలో నివాసం ఉంటున్న వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి వారికి నైపుణ్య సాంకేతిక శిక్షణ కల్పించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటుందని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి (పీవోయూసీడీ) వెంకట నారాయణ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో శుక్రవారం వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్‌లైన ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి మరమ్మతులు చేసేవారు పెయింటర్, బ్యూటీషియన్ (స్త్రీలైనా, పురుషులైనా) తదితర చేతివృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చేతి వృత్తిదారుల ఆర్థిక స్థితి గతులు మెరుగుపరచేందుకు, వారిలోని నైపుణ్యానికి మరింత మెరుగులు దిద్దే క్రమంలో ఈ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 556 అభ్యర్థులు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. దరఖాస్తుదారులందరికీ ఈ నెల 15 నుంచి 31 వరకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇవ్వటమే కాకుండా ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8790233881, 7780683789 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 23 వ డివిజన్ కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ బాలస్వామి, విజయవాడ నగరపాలక అధికారులు ఫణి కుమార్, సుజాత, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



నృత్యం ప్రదర్శించిన కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు నృత్య కళాకారులు నృత్య నీరాజనాలు అర్పించారు. విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన శ్రీనాట్య వేద ఆర్ట్స్ అకాడమీకి చెందిన లలితాదేవి పర్యవేక్షణలో 25 మంది చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులకు విశేషంగా అలరించింది. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు దేవస్థానం తరుపున ప్రశంసాపత్రాలు, ప్రసాదాలు అందచేశారు.

సావిత్రిభాయి పూలే చిరస్మరణీయురాలు



డీఎస్ఎంసీ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు.



హెచ్‌బీకాలనీలో చీరెలు పంపిణీ చేస్తున్న శ్రీధర్, శేషగిరిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ (డీఎస్ఎంసీ) హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాలు ఎం.శారద మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తితోనే ఎందరో మహిళలు ఆమె బాటలో నడుస్తున్నారని చెప్పారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే వంటి గొప్ప సంఘ సంస్కర్తలు నేడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎమ్ ప్రసాద్ మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో కూడా సమాజాన్ని ఎదిరించి అట్టడుగు వర్గాల మహిళలకు విద్య నేర్పిన సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని కొనియాడారు. విద్య నేర్పటమే కాకుండా నాటి మూఢాచారాలపై ప్రజలకు అవగాహన కల్పించి, భర్త జ్యోతీరావు పూలే అడుగుజాడల్లో సమాజ సేవ కోసం తన జీవితాన్ని అర్పించిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అన్నారు.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్సీ శేషగిరిరావు ఆధ్వర్యంలో భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ స్థానిక నాయకులు వై.రామయ్య, క్రేన్ శివాజీ, పి.నాగభూషణం, కాలనీవాసులు ఏవీఎస్ఎన్ ప్రసాద్, దాసరి బుజ్జి, బి.పూర్ణయ్య, వేంపల్లి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీవీటీ శర్మ సౌజన్యంతో 25 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

రాష్ట్ర ఖ్యాతిని చాటండి



విజయవాడస్పోర్ట్స్: జాతీయ పోటీల్లో విశేష క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్లకు సూచించారు. ఈనెల ఏడు నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లకు శాప్ కార్యాలయంలో జెర్సీలను శాప్ ఎండీ గిరిషాతో కలిసి శుక్రవారం ఆయన అందజేశారు. నాలుగేళ్ల తర్వాత రాష్ట్ర వాలీబాల్ జట్టు జాతీయ పోటీలకు వెళుతోందని రవి నాయుడు వెల్లడించారు. జాతీయ పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్లను ఇటీవలే శాప్ ఆధ్వర్యంలో ఎంపిక చేశామన్నారు. జాతీయ పోటీల్లో సత్తా చాటి పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

గన్నవరం రూరల్: ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.హరిశరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.

ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరణ



ముగ్గుల పోటీలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంధ్యారాణి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యార్థినులు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ మహిళా విభాగం బాధ్యులు ఎ.సంధ్యారాణి తెలిపారు. గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ముగ్గుల పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న కళలను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, ఎం.బి. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బిర్లా ఓపెన్‌మైండ్ సౌజన్యంతో ఎం.జి.రోడ్డులోని సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ పోటీలు మూడు కేటగిరిలలో జరుగుతాయన్నారు. మొదటి కేటగిరిలో 5, 6, 7 తరగతుల విద్యార్థినులు, రెండో కేటగిరిలో 8, 9, 10 తరగతులు, మూడో కేటగిరలో ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు, నాల్గో కేటగిరిలో మహిళలకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రవేశం ఉచితమని, స్పాట్ రిజిస్ట్రేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు సంక్రాంతి సాంప్రదాయ పద్ధతుల్లో భోగి మంటలతో పాటు గంగిరెద్దులు, హరిదాసుల కళారూపాలతో ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నార్ల బాల సాహిత్యం అపూర్వం

సాహితీవేత్త సీతారామ్



రతన్‌టాటా సంస్మరణ సభలో మాట్లాడుతున్న దాసరి రామకృష్ణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సాహితీవేత్త నార్ల చిరంజీవి సృష్టించిన బాల సాహిత్యం అపూర్వమని ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు సీతారామ్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 35వ విజయవాడ పుస్తక మహోత్సవం రెండో రోజు ప్రధాన సాహిత్య వేదికపై నార్ల చిరంజీవి శతజయంతి సభను నిర్వహించారు. ముఖ్యవక్త సీతారామ్ మాట్లాడుతూ ఏడు దశాబ్దాల క్రితమే నార్ల చిరంజీవి రచించిన తెలుగు పూలు నేటికీ బాలలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చదవవలసిన పుస్తకమన్నారు. తెలుగు సాహిత్యానికీ, తెలుగుజాతికీ నార్ల చిరంజీవి చేసిన సేవ బాలసాహిత్యానికి మాత్రమే పరిమితం కాలేదని చెప్పారు. ఆయన తన రచనల ద్వారా అభ్యుదయ భావాలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడ్డారని చెప్పారు. ఆకాశవాణి పూర్వసంచాలకు ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన సామ్యవాద భావాలను పిల్లలకు కథల ద్వారా నేర్పిన ఘనత నార్ల చిరంజీవిదని కొనియాడారు. వివిధ కథలను ఉదహరిస్తూ హింస లేకుండా సామ్యవాద భావాలను ఎలా సాధించవచ్చో ఆయన సూచించారన్నారు. శ్రీశ్రీ పబ్లిషర్స్ అధినేత, సాహితీ మిత్రులు సంస్థ నిర్వాహకులు విశ్వేశ్వరరావు సభలో పాల్గొన్నారు.

రతన్‌టాటా దేశానికి గర్వకారణం

పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా దేశానికి గర్వకారణమని పారిశ్రామికవేత్త దాసరి రామకృష్ణ అన్నారు. రతన్‌టాటా సంతాప కార్యక్రమం బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో పరిశ్రమలకున్న పాత్రను గుర్తించి, దాన్ని సమాజం, ప్రభుత్వం కూడా గుర్తించే స్థితికి చేర్చిన వ్యక్తి రతన్ టాటా అన్నారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మయ్య సభకు స్వాగతం పలికారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం పూర్వసంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, బాలాంత్రపు నాగప్రసూన ప్రతిభా వేదిక మీద నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.

శ్రీమద్భాగవత కథా శ్రవణం ముక్తిదాయకం



ప్రసంగిస్తున్న మేడసాని మోహన్

విజయవాడ కల్చరల్: శ్రీమద్భాగవత కథా శ్రవణం ముక్తి దాయకమని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని కళాశాల ఆడిటోరియంలో శ్రీమద్భాగవత సప్తాహం కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ భాగవతం విన్నా చదివినా ముక్తి కలుగుతుందని భక్తులు భావిస్తారని తెలిపారు. సకలవేద సారమే భాగవతమని వివరించారు. వ్యాస భగవానుడు భక్తులను తరింప జేయడానికి అష్టాదశ పురాణాలను రచించినట్లు తెలిపారు. సృష్టిలోని సమస్త జీవరాసులు భగవంతుని సంకల్పమేనన్నారు. నవ విధ భక్తులు ఉన్నాయన్నారు. శ్రవణం, కీర్తనం కూడా ప్రధానమైనవేనన్నారు. తొలిరోజు ప్రసంగంలో శ్రీమద్భాగత అవిర్భావ సందర్భం, నైమిశారణ్యంలో శౌనకాది మహామునుల సంవాదం, తదితర అంశాలు చోటు చేసుకున్నాయి. కార్యక్రమంలో కళాపీఠం ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణరావు ఎస్.లలిత్ ప్రసాద్, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్ మేడసానిని సత్కరించారు.

ఉన్నత విద్యారంగ సమస్యల పరిష్కారానికి వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘం (ఏబీఆర్ఎస్ఎం) నేతలు శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వై. వి. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ఎస్.వి.ఎస్. బాలసుబ్రహ్మణ్యం, డిగ్రీ కళాశాల విభాగం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ కె. బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి ఉపకులపతులను నియమించాలని కోరారు. అలాగే విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఐదు వేల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, నూతన జాతీయ విద్యావిధానంపై విద్యాసంస్థలకు, అధ్యాపకులకు సరైన అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బీఎల్ఎస్, ఏసీఎల్ఎస్‌పై శిక్షణ



లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్, ఇండియన్ రేడియాలజికల్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఏ) సంయుక్త ఆధ్వర్యంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వారి బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్), అడ్వాన్స్‌డ్‌కార్డియో వాస్క్యులర్ లైఫ్ సపోర్ట్ (ఏసీఎల్ఎస్) విధానాలపై మూడు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. మహాత్మా గాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ సదస్సును ఐఆర్ఐఏ జాతీయ అధ్యక్షుడు వీఎస్ వరప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో బీఎల్ఎస్, ఏసీఎల్ఎస్ ప్రాధాన్యం ఎంతో పెరిగిందన్నారు. వైద్యులు సిబ్బంది సైతం ఆ విధానాల్లో నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. డాక్టర్ కె.గోపాలకృష్ణ, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు డాక్టర్ సూర్యదేవర కేశరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలిరోజు ప్రాక్టికల్ సెషన్లు, హ్యాండ్- ఆన్ మాడ్యూల్స్, ఇంటరాక్టివ్ డిస్కషన్లతో శిక్షణ కొనసాగింది.